

'ఆహార భద్రత'..మరో ఐదేళ్లు

రేషన్ కార్డు దారులకు కేంద్రం తీపికబురు తెలిపింది. మరో ఐదేళ్ల పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది.

- 8లో▸



ధాన్యం..ఘనం

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ధాన్యం రాశులతో పోటెత్తింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం అమ్మకానికి వచ్చింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

28.0⁰ /15.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

తగ్గిన దిగుబడి

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

- దయనీయంగా అన్నదాతల పరిస్థితి
- 'మిచాంగ్'తో మరింత నష్టం
- ఎకరాకు 20 బస్తాల దిగుబడి మాత్రమే..



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు టేకుమట్ల మండలం రామకృష్టాపూర్ (వి)కి చెందిన వైనాల కిషన్‌రావు. ఐదెకరాల్లో వరి పంట సాగు చేశాడు. ఈ ఏడాది ప్రారంభం నుంచి పంట బాగా ఉండటంతో పెట్టుబడికి రాజీపడ లేదు. పొట్ట దశలో తెగుళ్లను తట్టుకోలేదు. ఎన్ని రకాల పురుగు మందులు పిచికారీ చేసినా.. ఫలితం లేదు. పైగా 'మిచాంగ్' ప్రభావంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గిందని వాపోతున్నాడు. జిల్లా వ్యాప్తంగా అన్నదాతల పరిస్థితి ఇలాగే ఉంది.

భూపాలపల్లి రూరల్: ఈ ఏడాది వరి రైతులకు అప్పులే దిగుబడులయ్యాయి. అతివృష్టి, అనావృష్టితో రైతులకు రుణాలే మిగిలాయి. ఈ వానాకాలంలో సాగుకు సమయానుకూలంగా వరణుడు కరుణించకపోవడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. పెట్టుబడి విషయంలో రాజీపడకుండా ముందుకు సాగిన రైతుకు తగ్గిన దిగుబడుతో చివరికి నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది. వానాకాలంలో వరికి పెట్టుబడి భారీగా పెరిగింది. విత్తనాల కొనుగోలు నుంచి వరి కోత వరకు భారీగా పెట్టుబడి పెరిగింది. ఇలా మొత్తం ఖర్చు రూ.22 వేల నుంచి రూ. 23 వేలకు చేరుతోంది. కౌలుకు ఎకరాకు రూ.15,000 చెల్లించాల్సి ఉంటుంది.

తగ్గిన దిగుబడి..

ప్రస్తుత వానాకాలం ప్రారంభంలో వరికి వాతావరణం అనుకూలంగా ఉంది. ప్రభుత్వం, అధికారులు సన్న రకాలను పండించాలని తెలపడంతో చాలా మంది రైతులు ఈ ఏడాది సన్నరకాలను సాగు చేశారు. అయితే వాతావరణం అనుకూలించక కొన్ని ప్రాంతాల్లో తెగుళ్లు సోకి దిగుబడి తగ్గింది. కేవలం ఎకరాకు 16 నుంచి 20 బస్తాల వరకు దిగుబడి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ఇందులోనూ 5 బస్తాల వరకు తాలు కింద పోతుందన్నారు.

'మిచాంగ్'తో మరింత నష్టం..

పెట్టుబడి భారమైన దిగుబడి తగ్గే సూచనలు కనిపిస్తున్నా.. మొక్కవోని ధైర్యంతో వరికోతలకు సమాయత్తమైన రైతులకు 'మిచాంగ్' తీరని శోకం మిగిల్చింది. తుపాను ప్రభావంతో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు వరి పంట పూర్తిగా నేల వాలింది. దీంతో గింజ నాణ్యత, ధరపై ప్రభావం చూపనుందని రైతులు వాపోతున్నారు.



వర్షాలకు నేలవాలిన వరిపైరు

చైన్ హార్వెస్టర్లకు డిమాండ్



నాచారంలో వరికోస్తున్న హార్వెస్టర్

రేగొండ: కోతకొచ్చిన పంట చేతికొచ్చే వేళ మిచాంగ్ తుపాను ప్రభావంతో వరి పొలాలన్నీ నేలవాలాయి. పొలాల్లో అధిక తేమ ఉండటంతో చైన్ హార్వెస్టర్‌లతో కోత కోయాల్సి రావడంతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. వరి కోతలకు వినియోగించే టైర్ హార్వెస్టర్ అద్దె గంటకు రూ.2,000 నుంచి రూ.2200 వసూలు చేస్తున్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పొలాల్లో తడి ఆరక టైర్ హార్వెస్టర్లు దిగబడుతుండటంతో చైన్ హార్వెస్టర్లను వినియోగించాల్సి వస్తోంది. ఇవి తెలంగాణలో తక్కువ సంఖ్యలో ఉండటంతో కొందరు పక్క రాష్ట్రాల నుంచి అద్దెకు తీసుకువచ్చి డిమాండ్‌ను బట్టి గంటకు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు వసూలు చేస్తున్నారు.

చేతికందని గడ్డి..

సాధారణ వరికోత యంత్రంతో కోస్తే సగమైన గడ్డి చేతికోస్తుంది. కాని చైన్ యంత్రంతో కోస్తే గెలల వరకు మాత్రమే కోస్తుంది. గడ్డి మొత్తం బురదలో కూరుకుపోతుంది. పశువులకు వరి గడ్డి రాకుండా పోతుంది. టైర్ హార్వెస్టర్‌తో పోలిస్తే చైన్ యంత్రం కిరాయి అధికంతో పాటు పశువులకు గడ్డి కూడా రాకుండా పోవడంతో రైతులకు రెండు విధాలా నష్టం జరుగుతుంది.

పెట్టుబడి రాదు..



ఎకరం సన్నదాన్యం సాగు చేశాను. మొదట బాగానే ఉంది. ఈ ఏడాది అధికంగా కురిసిన వర్షాలకు పంట ఎర్రబడింది. పురుగు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. పంట దిగుబడి తగ్గింది. ఈ ఏడాది ఎకరాలకు 8క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉంది.

- ఆకుదారి మల్లయ్య, పక్కీరుగడ్డ, భూపాలపల్లి

ఖర్చులు పెరిగాయి..



వర్షాలకు తోడు సాగు నీటి కాల్వల ద్వారా నీరు నిరంతరం పారుతోంది. వ్యవసాయ బావుల నుంచి నీరు పైకి ఉబికి వస్తుంది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలు తేమగా ఉన్నాయి. ఫలితంగా టైర్ హార్వెస్టర్‌తో వరి కోసే పరిస్థితి లేదు. మూడు ఎకరాల్లోని వరిని చైన్ హార్వెస్టర్‌తో కోయిస్తే దాదాపు రూ.24 వేలు ఖర్చు అవుతుంది. అంతకుముందు టైర్ హార్వెస్టర్‌తో రూ.10 వేలు అయ్యేది.

- ఒన్నాల శివాజీ, కొత్తపల్లిగోరి

న్యూస్‌రీల్

పాఠశాలను సందర్శించిన జడ్జి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా లీగల్ సెల్ అథారిటి జడ్జి జయరామ్‌రెడ్డి సందర్శించారు. బుధవారం ఆయన పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా, అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులకు ఏమైన ఇబ్బందులు ఉంటే లెటర్ ద్వారా తెలపాలని తన అడ్రస్‌ను విద్యార్థులకు తెలిపారు. ఆయన వెంట ఎస్సై లక్ష్మణ్‌రావు, హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాజీనామా

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. కలెక్టర్ భవేష్‌మిశ్రాకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. హరిబాబు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. నాటి నుంచి వారి ప్రత్యర్థులే విమర్శలు చేస్తూ గతంలో అవిశ్వాసానికి పట్టుబట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బహిరంగంగానే విమర్శలు చేశారు. అయితే మున్సిపాలిటీలో అవిశ్వాసం పెట్టకముందే తన పదవీకి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. వైస్ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడ విశ్వప్రయత్నాలు చేస్తుంది. బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు మంతనాలు జరిపినట్లు సమాచారం.

జీపీ రికార్డుల పరిశీలన



మహదేవపూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం డీఎల్‌పీఓ సుధీర్ కుమార్ రికార్డులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్న అద్దె గదుల వివరాలు, వాటికి సంబంధించిన అద్దె వసూలు, గ్రామంలోని పారిశుద్ధ్య పనులు, మురికి కాల్వల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పడిపూజ



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో శ్రీ హరిహర చతురూప అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం పడిపూజ నిర్వహించారు. గురుస్వామి బోయిని వెంకటస్వామి 18వ పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. పడి పూజ నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ మాస్టర్ అబ్బు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విద్యార్థుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 7న నల్గొండలో నిర్వహించిన కరాటే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఏటూరునాగారానికి చెందిన వసంత విశాల్(జెడ్పీహెచ్ఎస్), గూడూరి హర్షవర్ధన్(ఆర్‌ఎంసీ కమలాపురం), బి. శరత్ (వరంగల్ స్కూల్) పాల్గొని బంగారు పతకాలను సాధించారని తెలిపారు. అలాగే హరిణి, అన్వేషలు స్వీలర్ పతకాలు సాధించగా హర్షవర్ధన్, విశాల్, శరత్‌లు జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారన్నారు. రేపటి నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరగబోయే 67వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున పోటీల్లో పాల్గొనున్నట్లు మాస్టర్ అబ్బు వివరించారు. కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ములుగు జిల్లా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్, హుస్సేన్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

కాటారం: ఉద్యోగ హక్కులు, సమస్యల పరిష్కారానికి టీఎన్‌జీఓస్ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగు రవికుమార్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కాటారం యూనిట్ టీఎన్‌జీఓ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ హాజరై మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజల అకాంక్షలకు అనుకూలంగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ నూతన ప్రభుత్వానికి అనుకూలంగా పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం టీఎన్‌జీఓస్ కాటారం యూనిట్ (కాటారం, మహాముత్తారం, మల్హర్) సంబంధించిన నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. కాటారం యూనిట్ అధ్యక్షుడిగా మహాముత్తారం మండలం పంచాయతీ కార్యదర్శి వీర బొజ్జం, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు సతీష్(రెవెన్యూ), కోశాధికారిగా దుర్గా ప్రసాద్(వ్యవసాయ), ఉపాధ్యక్షులుగా జాటోతు రాజన్న(ఏఈఓ), అబ్దుల్‌హామ్మద్, పాగె లక్ష్మి, జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్, మహిళా వింగ్ నుంచి సరిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివకృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీగా రాజు, సభ్యులుగా కోటి, రవీందర్, దివ్యజ్యోతి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు రామ్మోహన్, టి.సత్యనారాయణ, మనీషా తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతోనే హక్కుల సాధన



సమ్మె చేస్తున్న తపాలా సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: సమ్మెతోనే హక్కుల సాధన జరుగుతుందని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం భూపాలపల్లి సబ్ పోస్టాఫీస్ బాధ్యుడు గోగు లక్ష్మినారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ ఎదుట సిబ్బంది చేపడుతున్న దేశ వ్యాప్తగా సమ్మె బుధవారం నాటికి రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ అనుకూల సిఫార్సులను అమలు చేయాలన్నారు. ఆర్థిక ఉన్నతి కోసం పొందాల్సిన ఇంక్రిమెంట్లు పొందకుండానే వేలాదిమంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5 లక్షల గ్రాట్యుటి వర్తింపు, ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సబ్ పోస్టాఫీస్ పరిధిలోని బీపీఎంలు, ఏబీపీఎంలు శివశంకర్, రఘు, నిర్మల, వెంకటేష్, శ్రావణ్‌కుమార్, రాజేష్, ప్రవీణ్, ప్రశాంత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసం గట్టెక్కేనా?

రేగొండ: మండల పరిషత్ అధ్యక్షురాలు పున్నం లక్ష్మీపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం గట్టెక్కుతుందా.. వీగుతుందా.. అనే చర్చలు మండలంలో జోరుగా చక్కెర్లు కొడుతున్నాయి. వారం రోజుల్లో అవిశ్వాస పరీక్ష ఉండటంతో ఎలాగైన అవిశ్వాస గండం నుంచి గట్టెక్కెలా ఎంపీపీ తమ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. మండలంలో 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా 12 మంది బీఆర్‌ఎస్, 5 ఇతరులు ఉన్నారు. అవిశ్వాసం గట్టెక్కాలంటే 9 మంది సభ్యులు కావాలి. అవిశ్వాసానికి తెరలేపిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 12 మంది ఎంపీటీసీలు మంగళవారం హనుమకొండ క్యాంపు రాజకీయాలకు తరలినట్లు తెలిసింది. బుధవారం వీరంతా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని కలిసినట్లు సమాచారం. అయితే క్యాంపునకు 11 మంది ఎంపీటీసీలు మాత్రమే వెళ్లగా మరొకరు ఇటీవల ఎమ్మెల్యేగా గెలిచిన గండ్ర సత్యనారాయణరావును కలిశారు. దీంతో ఆ ఎంపీటీసీ ఇప్పుడు ఎటు వైపు వెళ్తారనే ఆసక్తిగా మారింది. అవిశ్వాస సమయానికి మరికొందరు ఎంపీసీటీలు తమ వైపు వస్తారని ఎంపీపీ భర్త రవి తెలిపారు. ఒక వేళ మెజారిటీ ఎంపీటీసీల మద్దతు లేకుంటే పదవికి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..

- ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



నేరేడుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా బుధవారం నేరేడుపల్లి నుంచి భూపాలపల్లికి బస్సు సర్వీస్‌ను నేరేడుపల్లి గ్రామంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతకుముందు భూపాలపల్లి బస్టాండ్ నుంచి నేరేడుపల్లి వరకు ఆర్టీసీ డిపో మేనేజర్, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి జంగేడు, సెగ్గంపల్లి, కాసింపల్లి గ్రామాల మీదుగా నేరేడుపల్లి వరకు ప్రయాణం చేశారు. మార్గమధ్యలో ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికి, శాలువాలతో సన్మానం చేశారు. మహిళలు ఆధార్ కార్డు చూపించి, రాష్ట్రంలో ఎక్కడికైన ప్రయాణం చేయవచ్చన్నారు. అనంతరం జంగేడు, సెగ్గంపల్లి, కాశింపల్లి, నేరేడుపల్లి, వజినేపల్లి, గొర్లవీడు తండా, గొర్లవీడు, కొంపల్లి తండా, కొంపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ కమిటీల నాయకులు ఏర్పాటుచేసిన కృతజ్ఞత సభలల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి భూపాలపల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేసి, ప్రతి బుధవారం నేనే స్వయంగా దరఖాస్తుల స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుంకరి రాంచంద్రయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే

క్రీడాపోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ములుగు రూరల్: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మండల పరిధిలోని జాకారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు యాదాద్రి భువనగిరి జిల్లా రాజుపేటలో నిర్వహించగా టెన్నికాట్ విభాగంలో బుధవారం అండర్-14, 17, 19 విభాగాల్లో మొదటి బహుమతులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను ఆర్డీఓ అమరేందర్, ఆర్సీ రజిని, డీసీఓ శ్రీరాంశ్రీనివాస్‌ల చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పిచ్చిరెడ్డి, శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, రాంరెడ్డి, సత్యం, బాలకృష్ణ, రాజు నాయక్, పీడీ రవి, పీఈటీ భాస్కర్‌లు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా



హాజరైన అధికారులు, ప్రధానోపాధ్యాయులు

కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: ఈ విద్యాసంవత్సరంలో జరుగబోయే పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 3,528 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారని, పరీక్షల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను తక్షణమే గుర్తించి ప్రత్యేకంగా చదివించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు తప్పకుండా నిర్వహించాలన్నారు. అందులో విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ఉన్న సమస్యలను నివృత్తి చేయాలన్నారు. గతంలో మాదిరిగానే స్పెషల్ క్లాస్‌లో చదువుకునే విద్యార్థులకు స్నాక్స్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్, సెక్టోరియల్ ఆఫీసర్ కిషన్‌రావు, ఎంఈఓలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

డీఎంహెచ్‌ఓ మధుసూదన్



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

మహాముత్తారం: వైద్యసిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ మధుసూదన్ వైద్యసిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని కొర్లకుంట, పెగడపల్లి గ్రామాల్లోని పల్లె దవాఖానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గ్రామాల్లోని ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి వైద్యాధికారి సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి అన్వేషిని, జిల్లా క్వాలిటీ మేనేజర్ భానుకుమార్, డీపీఓ చిరంజీవి, డీడీఎం మధుబాబు తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీతోనే సమస్యల పరిష్కారం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: ఏఐటీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1వ గనిలో ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌కు రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత 80 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ గతంలో అనేక హక్కులను సాధించిందన్నారు. సింగరేణి లాభాల బాట, దీపావళి బోనస్ లాంటి అనేక హక్కులను సాధించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. అధికార పార్టీ, గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ గడిచిన 10 ఏళ్లలో కార్మికులకు చేసిందేమి లేదని విమర్శించారు. సింగరేణిలో వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా మోసం చేసిందన్నారు. నూతన గనులను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వానికి వంత పాడుతూ నూతన బొగ్గు గనుల అనుమతుల గురించి మాట్లాడలేదన్నారు. సింగరేణి ప్రైవేటీకరణను వేగంగా ప్రోత్సహిస్తూ అనేక గనులను ప్రైవేటుపరం చేస్తున్న పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, నాయకులు రామచందర్, శ్రీనివాస్, తోట రాంచందర్, చంద్రమౌళి, రవికుమార్, రాజ్‌మహమ్మద్, శ్రీనివాస్, ఐలయ్య, హైమద్, సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

ఐటీడీఏ పీఓ అంకిత్



ఆహారాన్ని పరిశీలిస్తున్న పీఓ అంకిత్

ఎస్ఎస్‌తాడ్వాయి: గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ భోజన నిర్వాహకులను ఆదేశించారు. మండల పరిధిలోని ఊరట్టం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పీఓ అంకిత్ బుధవారం సందర్శించారు. సోలార్ వాటర్ హీటర్ లభ్యత, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ పనితీరు, తాగునీటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా, ప్రస్తుతం ఉన్న బోరు బావి పనితీరు తదితర అంశాలపై పాఠశాల హెచ్‌ఎం రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఏ బోధకుడైనా అందుబాటులో లేకుంటే విద్యార్థినులకు కంప్యూటర్ తరగతులను బోధించడానికి సైన్స్ టీచర్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వంటగదిలో వండిన ఆహారాన్ని పీఓ పరిశీలించారు. మార్గదర్శకాల ప్రకారం మెనూ పాటిస్తున్నారా విద్యార్థినులకు తగినంత ఆహారం అందిస్తున్నారా అని అడిగారు. వంటవారు కార్మికుల లభ్యత, డైనింగ్ హాల్ ఏర్పాట్లను పరిశీలించారు. జీసీసీ సరుకుల పంపిణీ సరఫరాలపై ఆరా తీశారు. కూరగాయలు పాడవకుండా స్టోర్ గదికి వెంటిలేషన్ ఉంచాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు 1, 2 పూర్తయిన వివరాలపై ఆరా తీశారు.

సకాలంలో సిలబస్ పూర్తిచేయండి

ములుగు రూరల్: పదో తరగతి విద్యార్థుల సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల పరిధిలోని రాయినిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇటీవల ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టిన మరమ్మతు పనులు పరిశీలించారు. పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీజీ విద్యార్థులు 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఈనెల 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి జ్యోతి తెలిపారు. రూ. 250 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీవరకు గడువు ఉందని తెలిపారు. ఎంఏ, ఎంకాం కోర్సుల విద్యార్థులు అన్నిపేపర్లకు (రెగ్యులర్) రూ. 520 పరీక్షఫీజు, బ్యాక్‌లాగ్ మూడుపేపర్లు ఆపైరూ. 420, బ్యాక్‌లాగ్ రెండు పేపర్ల వరకు రూ. 160, ఇంప్రూవ్‌మెంట్ ప్రతి పేపర్‌కు రూ. 190 పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందన్నారు. ఎమ్మెస్సీ కోర్సుల్లో అన్ని సబ్జెక్టులకు రూ. 620, మూడుపేపర్లు ఆపై రూ. 520, రెండుపేపర్ల వరకు రూ.190, ఇంప్రూవ్‌మెంట్‌కు ప్రతి పేపర్‌కు రూ.190 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య

గీసుకొండ: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు.. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ వసంతాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఊరుగొండ బాబురావు(67) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో బంధువులు అతడి తీరు నచ్చక మందలించేవారు. ఇటీవల కింద పడగా తీవ్రగాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. అయినా తాగుడు మానకపోవడంతో భార్య మందలించింది. దీంతో మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఇంటికి రాగా గమనించిన కుటుంబీకులు ఎంజీఎంలో చేర్పించగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బుధవారం తెలిపారు.

ధర్మారంలో మనస్తాపంతో యువతి ..



హరిప్రియ మృతదేహం

ఎల్కతుర్తి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారంలో జరిగింది. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెప్యాల హరిప్రియ(25) నర్సింగ్ కోర్సు పూర్తి చేసి 2 సంవత్సరాలు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేసింది. అనారోగ్య సమస్యతో ఆరు నెలల క్రితం ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. కాగా, అదే గ్రామానికి చెందిన గుర్రం రాజేష్, హరిప్రియ 5 సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్నారు. అయితే రాజేష్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన హరిప్రియ.. మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి మొగిళి ఫిర్యాదు మేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఆహార భద్రత'.. మరో ఐదేళ్లు

ఉచిత బియ్యం పంపిణీ గడువును పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 10.92 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న నిరుపేదలు



తొర్రూరు మండలం సోమారపుకుంట తండాలో రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

తొర్రూరు : కేంద్ర ప్రభుత్వం.. ఆహార భద్రత (రేషన్) కార్డుదారులకు తీపి కబురు తెలిపింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు రోజురోజుకూ ఆకాశానికి చేరుతున్నాయి. ఫలితంగా కొనుగోలు చేయలేక ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత బియ్యమే తింటూ జీవనం కొనసాగిస్తారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరో ఐదు సంవత్సరాల వరకు వారికి ఆహార కోసం ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకం ద్వారా కరోనా కాలం నుంచి అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం పంపిణీని మరో ఐదేళ్ల పాటు పొడగిస్తున్నట్లు కేంద్రం రెండు రోజుల క్రితం ప్రకటించింది. ఈ నిర్ణయంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వరకు విడతల వారీగా బియ్యం పంపిణీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. 2022 మార్చిలో ఆరు నెలలు పెంచింది. ఆ తర్వాత మరో మూడు నెలలు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. అదే ఏడాది చివర్లో కార్డులోని ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందించాలని నిర్ణయించి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నెలతో ఆ గడువు ముగుస్తుండడంతో మరోసారి 2024 నుంచి ఐదేళ్ల పాటు అనగా 2029 సంవత్సరం వరకు యూనిట్‌కు ఆరు కిలోల బియ్యం చొప్పున అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

ఉచితంగానే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10.92 లక్షల మంది ఆహారభద్రత కార్డుదారులు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 2,66,088, వరంగల్ జిల్లాలో 2,19,267, మహబూబాబాద్ జిల్లాలో 2,35,435, భూపాలపల్లి జిల్లాలో 1,21,380, జనగామ జిల్లాలో 1,61,246, ములుగు జిల్లాలో 89,330 కుటుంబాలకు ఉచిత బియ్యం లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,645 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు ప్రతినెలా 22,146 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కేంద్రం ఉచిత బియ్యం మరో ఐదేళ్ల పాటు అందించాలని నిర్ణయించడంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. కాగా, ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు.

తండాల్లోనూ ఏర్పాటైతే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తండాలే అధికం. గత ప్రభుత్వ హయాంలో చాలా వరకు గ్రామ పంచాయతీలుగా మారాయి. అయితే ఆయా చోట్ల రేషన్ దుకాణాలను మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ తండాల నుంచి సమీప గ్రామాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. అక్కడికి వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండటంతో రవాణా భారం తప్పడం లేదు. కొంత మంది లబ్ధిదారులు దూరం వెళ్లలేక, చార్జీల భారం మోయలేక తెచ్చుకోవడం మానేశారు. కొన్ని చోట్ల డీలర్లు ఇష్టానుసారంగా దుకాణాలు తెరుస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించి మారుమూల తండాల్లో, అవసరమైన చోట రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కానిస్టేబుల్ మీర్ మహ్మద్ అలీకి అభినందన



సీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ అలీ

కాజీపేట: ఇతర రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠాల సమాచారం అందజేస్తూ నిందితులను పట్టుకోవడానికి సహకరిస్తున్న క్రైమ్ వింగ్ కానిస్టేబుల్ మీర్ మహ్మద్ అలీకి తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు ప్రశంస పత్రాలు పంపించారు. వీటిని కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం అలీకి అందించారు. నగరంలోని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ వింగ్‌లో విధులు నిర్వహిస్తున్న మీర్ మహ్మద్ అలీ జాతీయ స్థాయి క్రైమ్ విభాగానికి అనుబంధంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ గ్రూప్‌లో ఉన్న అంతర్ రాష్ట్ర పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తూ నేరం ఎక్కడా జరిగిన వెంటనే స్పందిస్తూ నేర పరిశోధనకు అవసరమైన సలహాలు అందించేవారు. ఇందులో భాగంగా ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కొటావలి పీఎస్ పరిధిలో దృష్టి మర్చి రూ.14లక్షల నగదు అపహరించిన ఘటనతో పాటు తమిళనాడులోని ఈరోడ్‌లో జరిగిన 800గ్రాముల బంగారం చోరీకి సంబంధించి సాయం అందించారు. అలీ సమాచారం ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజ్‌నందన్ జిల్లా సీనియర్ ఎస్పీ అభిషేక్ మీనా, ఈరోడ్ ఎస్పీ అనిల్‌కుమార్, కోయంబత్తూర్ రేంజ్ డీఐజీ శ్రావణ్ సాయి సుందర్ 2023వ సంవత్సరానికిగానూ వరంగల్ క్రైమ్ వింగ్ కానిస్టేబుల్ అలీని అభినందిస్తూ ప్రశంస పత్రాలు పంపించారు.కాగా, అలీని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

గణిత శాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలు


- వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎన్ రెడ్డి

కేయూ క్యాంపస్: గణితశాస్త్రంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని గణితశాస్త్ర విభాగంలో మ్యాథ్‌మెటిక్స్ అండ్ అప్లైడ్ మ్యాథ్స్‌మెటిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆ విభాగం అధిపతి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఓరియెంటేషన్‌లో వైఎన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణితశాస్త్ర విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. డొమైన్ నైపుణ్యాలతోపాటు 21వ శతాబ్దపు నైపుణ్యాలు కూడా ముఖ్యమన్నారు.వరంగల్ కిట్స్ కళాశాల ఆచార్యులు ఎ శ్రీహరి రావు మాట్లాడుతూ గణితశాస్త్ర విద్యార్థులు నూతన ఒరవడులు కలిగి ఉండాలన్నారు. కేవలం తరగతిగదికే పరిమితం కావొదన్నారు. అసోసియేట్ ఆచార్యుడు ఎల్‌పీ రాజ్‌కుమార్ చాయిస్‌బేస్డ్ క్రెడిట్ సిస్టమ్, పరీక్షా విధానం గురించి వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ స్కిల్స్, వాటి ఆవశ్యకతపై వివరిస్తూ ప్రాంగణ నియామకాల కోసం ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ బీఎస్ ఎల్ సౌజన్య, డాక్టర్ భారవిశర్మ, డాక్టర్‌సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ



హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో భద్రకాళి భక్త సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం భద్రేశ్వరస్వామి వారికి అన్నపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు.

మంత్రులను కలిసిన దేవాలయ ఈఓ..

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను బుధవారం హైదరాబాద్‌లో దేవాలయ ఈఓ శేషుభారతి, అర్చకులు టక్కరసు సత్యం కలిశారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం.. ఘనం



కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం రాశులు



పత్తి యార్డులో రైతుల పడిగాపులు

- కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం
- రికార్డు స్థాయిలో 38వేల బస్తాల రాక
- సీజన్ ప్రారంభం నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటిసారి

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ బుధవారం ధాన్యం రాశులతో పోటెత్తింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి మొత్తం 38 వేలకు పైగా బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధిక ధాన్యం రావడం ఇదే మొదటి సారి. దీంతో మార్కెట్‌లోని షెడ్లు, ఓపెన్ యార్డు ధాన్యపు రాశులతో నిండిపోయాయి. కాగా, ధాన్యం అత్యధికంగా రావడంతో టెండర్లు ఆలస్యంగా వేశారు. 3 గంటల సమయంలో విన్నర్ లిస్టు విడుదలైంది. సుమారు 15వేల బస్తాల ధాన్యమే వ్యాపారులు ఖరీదు చేశారు. రాత్రి వరకు కాంటాలు, లొలకాలు జరిగాయి. మిగిలిన రైతులు రాశుల వద్దే పడికాపులు కాశారు. కాగా, మార్కెట్‌కు 38,322 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, జైశ్రీరామ్ రకం ధాన్యానికి గరిష్ట ధర రూ.3,302, కనిష్ట ధర రూ.2,900, ఆర్ఎన్ఆర్ రకానికి గరిష్ట ధర 3,275, కనిష్ట ధర రూ.2,560, హెచ్ఎంటీ రకానికి గరిష్ట ధర రూ.3,236, కనిష్ట ధర రూ.1,759, బీపీటీ రకానికి గరిష్ట ధర రూ.2,000, కనిష్ట ధర రూ.1,889 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో వాహనాలు వెళ్లే దారిలో ధాన్యం పోయడం వల్ల తాము ఖరీదు చేసిన పత్తిని ఎగుమతి చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ వ్యాపారులు బుధవారం టెండర్లు వేసేందుకు రాలేదు. దీంతో రైతులు పడిగాపులు కాశారు. చివరకు అధికారులను ప్రశ్నించడంతో వారు పత్తి వ్యాపారులతో చర్చలు జరిపారు. ధాన్యం అత్యధికంగా రావడం మూలంగా రైతులు ఓపెన్‌యార్డులో పోసుకున్నారని, ఇక మీదట అలా జరుగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో పత్తి వ్యాపారులు టెండర్లు ఆలస్యంగా వేయడంతో రాత్రి వరకు కాంటాలు, లొలకాలు నిర్వహించారు.

అర్ధరాత్రి యువకుడిపై దాడి



రోదిస్తున్న తల్లి, బంధువులు



రాకేష్‌పై దాడి చేస్తున్న ఆకతాయి

- ఆభరణాలు, నగదు దోచుకున్న ఆకతాయిలు
- చికిత్స పొందుతూ యువకుడి మృతి
- కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం



రాకేష్ (ఫైల్)

కాశిబుగ్గ: నగర నడిబొడ్డు వరంగల్ కూరగాయల మార్కెట్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో ముగ్గురు ఆకతాయిలు ఆ యువకుడిపై విచక్షణరహితంగా దాడికి పాల్పడి అతడి వద్ద ఉన్న ఆభరణాలు, నగదు దోచుకున్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాల పాలైన యువకుడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి రావడంతో కాశిబుగ్గ శాంతినగర్‌లో విషాదం నెలకొంది. 20వ డివిజన్ కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన ఏకెల్లి రమేష్, మరియ దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. 10 ఏళ్ల క్రితం తండ్రి రమేష్ చనిపోవడంతో అన్నదమ్ములు దేవరాజ్, రాకేష్(23) బాధ్యత తీసుకుని రెండు సంవత్సరాల క్రితం సోదరి పెళ్లి చేశారు. ఈ క్రమంలో రాకేష్ వంట పని కోసం సోమవారం హనుమకొండకు వెళ్లాడు. అర్ధరాత్రి మహిళ విజయతో కలసి ఇంటికి చేరుకోవడానికి వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ఆటోలు లేకపోవడంతో నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్దకు రాగా ముగ్గురు ఆకతాయిలు మద్యం మత్తులో వారిని అడ్డుకున్నారు. విజయను బెదిరించి రాకేష్‌పై దాడికి పాల్పడ్డారు. అనంతరం రాకేష్ వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, రూ. 6,500 నగదును దోచుకెళ్లారు. తీవ్రగాయాల పాలైన రాకేష్‌ను విజయ స్థానికుల సాయంతో ఎంజీఎంకు తరలించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న రాకేష్ మంగళవారం రాత్రి చెందాడు. కాగా, రాకేష్ మృతికి కారణమైన ఆకతాయిలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు లోపించాయని వివరించడానికి ఈ ఘటన కారణమని చెప్పొచ్చని వారు పేర్కొంటున్నారు. కాగా, దాడికి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలు వాట్సాప్‌లో వైరల్ కావడంతో దుండగులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రాకేష్ మృతదేహన్ని కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రుద్రేశ్వరాలయంలో ఘనంగా గౌరీనక్తం



గౌరీనక్త వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వారి వేయి స్తంభాల దేవాలయంలో బుధవారం గౌరీనక్త వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ప్రత్యేక పూజలు జరిపారు. నాట్యమండపంలో 21 కిలోల పసుపుతో గౌరీమాతగా అలంకరించి పూజలు జరిపారు. కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. మహిళలు లలితాసహస్ర నామపారాయణం చేశారు.

ఆదాయం రూ.3,89,706

వేయిస్తంభాల ఆలయ నెలవారీ హుండీ ఆదాయం రూ. 3,89,706గా నమోదైనట్లు దేవాలయ ఈఓ వెంకటయ్య తెలిపారు. హుండీ లెక్కింపులో పరిశీలకులుగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వ్యవహరించారు.

కదులుతున్న బస్సు నుంచి దూకి ..

- ఛత్తీస్‌గఢ్ వాసి మృతి
- ఏటూరునాగారంలో ఘటన



మంగాలు మృతదేహం

ఏటూరునాగారం: కదులుతున్న బస్సు నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాడవి మంగాలు(43) ఇటీవల ఏటూరునాగారంలో ఉంటున్న బంధువుల వద్దకు వచ్చాడు. తిరిగి ఇంకొందరు బంధువులు ఉంటున్న భద్రాచలం వెళ్లడానికి ఏటూరునాగారం బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడ హనుమకొండ వెళ్లే బస్సులో కూర్చున్నాడు. అయితే ఏ గ్రామం వెళ్లాలని కండక్టర్ అడగగా భద్రాచలమని సమాధానం ఇచ్చాడు. ఈ బస్సు హనుమకొండకు వెళ్తుందని, వేరే బస్సులో ప్రయాణించాలని కండక్టర్ సూచించాడు. దీంతో అప్పటికే అతిగా మద్యం తాగి ఉన్న మంగాలు బస్సు కదులుతుండగానే అందులో నుంచి దూకాడు. తీవ్ర గాయాలు కావడంతో కండక్టర్ జితేందర్‌రెడ్డి, డ్రైవర్ స్వామి వెంటనే 108లో సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాగా, ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు నుంచి దూకి మృతి చెందిన ఘటనను తెలుసుకున్న డీఎం సురేష్ బుధవారం రాత్రి ఘటనా స్థలిని పరిశీలించారు. ప్రమాద తీరుపై తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సాగరంలో చెరువులో పడి వ్యక్తి ..



దస్రూ (ఫైల్)

జఫర్‌గఢ్: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సాగరంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. రేగడితండా గ్రామ శివారు టీబీతండాకు చెందిన గుగులోతు దస్రూ (46) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు దస్రూ కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సాగరం గ్రామ చెరువులో ఓ మృతదేహం పైకి తేలింది. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్సై మహేందర్ వెంటనే ఘటనా స్థలికి చేరుకుని చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని దస్రూ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీరు.. నిర్లక్ష్యం వద్దు!

పశువులకు శుభ్రమైన నీరే ప్రధానం
- అధిక పాలదిగుబడికి అత్యంత కీలకం
- తక్కువైతే మూత్ర సంబంధ వ్యాధులు
- నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం బారిన పడే అవకాశాలు





నీరు తాగుతున్న పశువులు

కాజీపేట: పశుపోషణలో దాణా, మేతతో పాటు తాగునీటి విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే పశుపోషకులు మొదటి, రెండు విషయాల్లో తీసుకుంటున్న శ్రద్ధ తాగునీటి విషయంలో తీసుకోవడం లేదు. పశువులకే కదా! అని గుంతల్లో నిలిచిన నీటిని తాగిస్తారు. అలాగే, తక్కువ పరిణామంలో అందిస్తున్నారు. ఫలితంగా పశువులు అనారోగ్యం బారినపడి పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పాడి పశువుల తాగునీటి అవసరాలు, వాటి సంరక్షణపై సోమిడి పశువైద్యాధికారి కరుణాకర్‌రెడ్డి రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు.

అవసరమైన నీరు అందించాలి..

పశువులు ఆహారం లేకుండా వంద రోజులైనా జీవిస్తాయి. కానీ నీరు లేకుండా నాలుగైదు రోజులకు మించి బతకలేవు. శరీరంలో కొవ్వు మొత్తం పోయినా, 50 శాతం వరకు మాంసకృత్తులు పోయినా పర్వాలేదు గాని.. పది శాతం నీరు పోతే ప్రాణాంతకమవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పశువులకు నీటి ప్రాధాన్యం గుర్తించాలి. దాణా, మేతతో పాటు తగినంత నీటిని అందించినప్పుడే పాల దిగుబడిలో పెరుగుదల కనిపిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి.

అధిక పాల దిగుబడి కోసం..

పాడి పశువుల్లో పాల ఉత్పత్తికి నీరు చాలా అవసరం. పాలల్లో 80 శాతం వరకు నీరు ఉంటుంది. ప్రతీ లీటర్ పాల ఉత్పత్తికి పశువుకు కనీసం నాలుగైదు లీటర్ల నీరు ముఖ్యం. పశువులకు నీరు సరిపడినంత అందకపోతే పాల దిగుబడి తగ్గిపోతుంది.

రోజుకు 40 నుంచి 50 లీటర్లు నీరు..

సాధారణంగా పాడిపశువు రోజు 40 నుంచి 50 లీటర్లు నీరు తాగుతాయి. పాలిచ్చే పశువులు అయితే ప్రతి లీటర్ పాలకు నాలుగైదు లీటర్ల నీరు తాగుతాయి. అనావృష్టి పరిస్థితుల్లో పశువులకు పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఎండుగడ్డి, జొన్న చొప్ప, సజ్జవంటి మేత వేయాల్సి ఉంటుంది. అందుకే పశువు ఎక్కువ నీరు తాగుతుంది. పచ్చగడ్డి సమృద్ధిగా లభించినప్పుడు నీటి అవసరం కొంత తగ్గుతుంది. చూడి పశువులకు నీరు ఎక్కువగా ఇవ్వాలి. పశువులకు రోజుకు రెండు, మూడు దఫాలు నీటిని పెడుతూ ఉండాలి. వేసవిలో పశువు నీరు తాగడానికి 24 గంటలు పరిశుభ్ర చల్లని నీరు అందుబాటులో ఉంచితే మరింత మంచిది.

నీరు తక్కువైతే...

పశువులకు నీటి లభ్యత తక్కువైతే జీర్ణక్రియ వ్యవస్థ దెబ్బతిని మూత్ర సంబంధ సమస్యలు ఎదురవుతాయి. నీటి లభ్యత బాగా తగ్గితే వేసవిలో పశువులకు రక్త శాతం కూడా తగ్గుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి చివరకు పశు మరణాలు సంభవిస్తాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పాడి, వ్యవసాయ పశువులకు నీటిని తాగించే ముందు జాగ్రత్తలు పాటించాలి. నీటిలో కరిగి ఉన్న కాల్షియం, మెగ్నీషియం, ఉప్పుపై నీటి నాణ్యత ఆధారపడి ఉంటుంది. నీరు కొంచెం ఉప్పుగా ఉన్నా పశువులు క్రమేపి అలవాటుపడి తాగుతాయి. కానీ నీటిలో నైట్రేట్లు ఎక్కువగా ఉండడం మంచిది కాదు. మేతకు బయటకు వెళ్లే పశువులు అపరిశుభ్రంగా ఉండే నీటిని తాగితే వ్యాధుల బారిన పడతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి.